నత్తనడకన బ్రిడ్జి నిర్మాణం

- రెండేళ్లుగా కొనసాగుతున్న వైనం
- వర్షం కురిస్తే రాకపోకలు బంద్
- చోద్యం చూస్తున్న అధికారులు
- నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్

వాహనదారుల సౌకర్యార్థం నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం మందకొడిగా సాగుతుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న రోడ్డుపై రెండేళ్ల కిందట చేపట్టిన బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాహన రాకపోకల కోసం తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించారు. అది కూడా గుంతలమయంగా మారడంతో పాటు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. అలాగే వాగు పొంగితే వారం పాటు రాకపోకలు నిలిచి రెండు మండలాలకు సంబంధాలు తెగిపోతున్నాయి.


దర్గపల్లి వద్ద నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండల ప్రజలు కరీంనగర్‌కు వెళ్లాలన్నా, అక్కడి నుంచి వచ్చే వాహనాలు హన్మకొండకు వెళ్లాలన్నా మల్లారం నుంచి సికింద్లాపూర్, దర్గపల్లి, బద్దిపడగ మీదుగా ప్రయాణిస్తారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని చిన్నకోడూర్ మండలం మాచాపూర్ నుంచి నంగునూరు వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టారు. దర్గపల్లి నుంచి సికింద్లాపూర్ వెళ్లే దారిలో వాగు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించిపోయేవి. అలాగే గతంలో నిర్మించిన బ్రిడ్జ్ తక్కువ ఎత్తులో ఉండటంతో వాహన దారులు వాగు ప్రవాహంలో కొట్టుకుపోయేవారు. ఇప్పటి వరకు ముగ్గురు మరణించగా, పలు వాహనాలు ప్రవాహానికి కొట్టుకపోయాయి. దీంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.15 కోట్లు మంజూరు చేశారు. 2022 మార్చి 31వ తేదీన హరీశ్‌రావు శంకుస్థాపన చేసి ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

మూసి వేయాల్సి రావడంతో..

బ్రిడ్జి నిర్మాణం దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లవుతున్నా పూర్తి చేయలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు బ్రిడ్జి పక్క నుంచి వేసిన మట్టి రోడ్డు తరచూ నీట మునగడంతో ఈమార్గం గుండా రాకపోకలు స్తంభించిపోతున్నాయి. అంతేకాకుండా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈమార్గాన్ని మూసి వేయాల్సి రావడంతో వాగు వరకు వచ్చిన తిరిగి వెళ్లాల్సివస్తోంది. దీంతో దూరంతోపాటు ఆర్థిక భారం పెరుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా పెట్టిన ట్రాక్టర్ (ఫైల్)

రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



రెండు వరుసల రోడ్డుతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది. అయితే నిర్మాణం పూర్తికాకపోవడంతో కరీంనగర్ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రెండేళ్ల కిందట కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు పూర్తి చేయకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
– కొల్ల శ్రీకాంత్‌రెడ్డి, దర్గపల్లి

రోడ్డు మూసేయాల్సి వస్తోంది



గ్రామం గుండా పారే వాగులో పడి వాహనాలు కొట్టుకుపోయి చాలామంది మరణించారు. వానాకాలంలో నీటి ప్రవాహం పెరగడంతో రోడ్డును మూసివేయాల్సి వచ్చేది. ఈవిషయం అప్పుడు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించారు. ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రెండేళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు.
– సీత బాలయ్య, మాజీ సర్పంచ్ దర్గపల్లి

క్లుప్తంగా

సీఎంని కలిసిన మాజీ ఎమ్మెల్యే


సీఎం రేవంత్‌రెడ్డితో ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిసినట్లు మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. అభివృద్ధి పనుల కోసం జనగామ నియోజకవర్గంలోని చేర్యాల మున్సిపాలిటీకి రూ.10 కోట్లు, జనగామ మున్సిపాలిటీకి రూ.25 కోట్ల చొప్పున స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ని మంజూరు చేసినందుకు సీఎంను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపానన్నారు.

జగదేవ్‌పూర్ తహసీల్దార్‌గా కృష్ణమోహన్

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండల తహసీల్దార్‌గా గురువారం కృష్ణమోహన్ బాధ్యతలు చేపట్టారు. ఈయన కలెక్టరేట్‌లో పనిచేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఇక్కడ పనిచేసిన శ్రావణ్‌కుమార్ బదిలీపై గజ్వేల్‌కు వెళ్లారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

హుస్నాబాద్: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని హుస్నాబాద్ పట్టణ వాసవీ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ నీరుమల్ల స్మిత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నెలరోజులు అల్పాహారం అందజేశారు. చివరి రోజు గురువారం అరటి పండ్లు, స్వీట్స్ పంపిణీ చేసి ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మిత మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమయ్యే సామగ్రిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ నూక సంపత్, ప్రధాన కార్యదర్శి దొమ్మాట శ్యాం, కోశాధికారి కొండూరి శ్రీకాంత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రభాకర్


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన తన్నీరు రమేష్ పలు ఆరోపణలతో సస్పెండ్ అయ్యాడు. గురువారం ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు.

నిర్మాణాలకు నిధులు కేటాయించాలి

ఎంపీపీ మాలోతు లక్ష్మీ


వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ మాలోతు లక్ష్మీ

అక్కన్నపేట(హుస్నాబాద్): నూతనంగా ఏర్పాటైన అక్కన్నపేట మండలంలో సమీకృత భవనాల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపీపీ మాలోతు లక్ష్మీ గురువారం వినతి పత్రం ఇచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మండలం కేంద్రంలోని 387 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాలో సమీకృత భవనాలు నిర్మాణానికి స్థల సేకరణ చేశారన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. యాద్రాది భువనగిరి జిల్లా రాజపేటకు చెందిన ముఢావత్ బన్నీ టీఎస్ 30టీఏ 4210 టాటా ఏస్ వాహనంలో దూళ్మిట్ట నుంచి అక్రమంగా 12.60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అరకొర వసతులతో ప్రారంభించడం సరికాదు


మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదిత్య

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన డిగ్రీ కళాశాలలో సరైన వసతులు కల్పించకుండా కళాశాలను ప్రారంభించాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించడం సరికాదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య అన్నాడు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన డిగ్రీ కళాశాలను మంత్రి, కలెక్టర్ సందర్శించి స్పందించడం సంతోషకరమన్నారు. వసతులు కల్పించకుండా వెంటనే పాత డిగ్రీ కళాశాలను, నూతన డిగ్రీ కళాశాలకు తరలించాలని ఆదేశించడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో రూ.2.25 కోట్లతో నిర్మించారని, ప్రారంభం కాకముందే శిధిలావస్థకు చేరుకుందని ఆరోపించారు. కళాశాలలో మౌలిక వసతులు లేవన్నారు. రానున్న 15 రోజుల్లో డిగ్రీ పరీక్షలు ఉన్నందున విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా మౌలిక వసతులు కల్పించిన తర్వాతనే కళాశాలను ప్రారంభించాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి రాకేష్, చరణ్, రాహుల్ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎంపీపీ బాలేశం గౌడ్


మాట్లాడుతున్న ఎంపీపీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ బాలేశంగౌడ్ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందుస్తుగా గ్రామాల్లో తాగునీటి సమస్య, విద్యుత్ కోతలు లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు రాకుంటే వెంటనే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటిని వృథా చేయకుండా కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇటిక్యాల, కొత్తపేట గ్రామాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


నోటీసు అందజేస్తున్న వన్‌టౌన్ ఎస్‌ఐ నర్సింహారావు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట బస్టాండ్ పరిసరాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పబ్లిక్ సేఫ్టీ అండ్ మెజర్స్‌యాక్ట్ ప్రకారం సంబంధిత అధికారులకు ఎస్‌ఐ నరసింహరావు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

జైలు, జరిమానా

మద్దూరు(హుస్నాబాద్): 2022లో నాటు సారా తయారీకి వంద లీటర్లు బెల్లం పానకం నిల్వ చేసిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ మురళీకృష్ణ తెలిపారు. దూళ్మిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండాకు చెందిన బానోతు రమేష్ 2022 ఫిబ్రవరి 16వ తేదీన గ్రామంలో 100 లీటర్ల బెల్లం పానకంతో నాటుసారా తయారు చేస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. గురువారం హుస్నాబాద్ 1వ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కేసు విచారణచేసి నిందితుడిదకి ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. రమేష్‌ను కరీంనగర్ జైలుకు తరలిస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు.

యాసంగికి సాగునీరు అందించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బాలకృష్ణ

సిద్దిపేటరూరల్: యాసంగి పంటల సాగుకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ బాలకృష్ణ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరాచేస్తున్నామని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకముందే చర్యలు తీసుకోవాలన్నారు. గుర్రాలగొంది ఎంపీటీసీ హరీశ్ 11 తీర్మానాలు ప్రవేశ పెట్టగా ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ బలపరిచారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్, ఎంఈవో యాదవరెడ్డి, ఏఈలు పవన్ కుమార్, తిరుపతి, వెంకటేశ్, ఏఓ వెంకట రమణి, ఏపీఎం ధర్మసాగర్, ఏపీఓ స్రవంతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబ సేవలు చిరస్మరణీయం

మంత్రి పొన్నం ప్రభాకర్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: తెలుగు భాషలో సరళంగా రామాయణాన్ని అనువదించిన కవయిత్రి మొల్లమాంబ సేవలు చిరస్మరణీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆమె జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని మొల్లమాంబ క్యాలెండర్‌ను గురువారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొల్లమాంబ సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని తెలుగులో అనువదించిన గొప్ప కవయిత్రి అన్నారు. మొల్లమాంబ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కుమ్మరి సంఘం నాయకులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయ కులు రామనాధం, చంద్రమౌళి, నమిలికొండ అయిలయ్య, రాజయ్య, బెక్కంటి బీమయ్య, నాంపల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

సమావేశానికి ప్రత్యేక అధికారులు డుమ్మా


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అధికారి

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వ పథకాలను అమలు చేయడంతోపాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించాల్సిన అధికారులే సమావేశానికి రాకపోవడంతో గురువారం జరిగిన నంగునూరు మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎనిమిది శాఖల అధికారులతో పాటు సగం మంది గ్రామ స్పెషలాఫీర్లు సభకు హాజరుకాకపోవడం వారి పనితీరుకు అద్దంపట్టింది. ఎంపీపీ ఉపాధ్యక్షురాలు కర్నకంటి రేణుక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎంపీడీఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేశామని, లబ్ధిదారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో విద్యుత్ బిల్లులు, గ్యాస్ సబ్సిడీ సమస్యలు వస్తున్నాయన్నారు. ఈనెల 4వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీల చెక్‌పవర్ ప్రత్యేక అధికారులకు ఇచ్చామని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

అప్రమత్తతో విధులు నిర్వహించాలి

సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వహించాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఇన్‌చార్జిలు, సిబ్బందికి విధుల నిర్వహణపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, శ్రీధర్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు గురువారం జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు చోట్ల తమ సిబ్బందితో కలిసి వారం క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 23 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి రూ.9,400 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కల్తీకల్లు నిరోధించడంలో విఫలం

మండల సభ ఆగ్రహం


ఎక్సైజ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు

మిరుదొడ్డి(దుబ్బాక): కల్తీకల్లును నిరోధించడంలో ఎక్సైజ్ అధికారులు విఫలమయ్యారని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో కల్తీకల్లును నిరోధించాలని అధికారులను ఆదేశించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు అసహనం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అల్వాల శివారులో కల్తీ కల్లువిక్రయిస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం జరుగుతోందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు ఎంపీటీసీలు ఆరోపించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో తహసీల్దార్ గోవర్ధన్, ఎంపీడీఓ గణేష్‌రెడ్డి, ఎంఈఓ జోగు ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించే వారికే మద్దతు

తెలంగాణ రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీహరి రావు


మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీహరిరావు

హుస్నాబాద్: సమస్యలు పరిష్కరించే పార్టీలకే రైతుల మద్దతు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు అన్నారు. గురువారం పట్టణంలో రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకోసం అప్పులు చేసి పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. తెచ్చిన అప్పులు తీర్చలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో పలువురి చేరిక**

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామం పోతారం మాజీ సర్పంచ్ గడీల జనార్ధన్‌రెడ్డి, ఎనగుర్తి, పెద్ద గుండవెల్లి, రామక్కపేట, హబ్షీపూర్, చౌదర్‌పల్లి, నగరం మాజీ సర్పంచ్‌లు గుండా శంకర్,సద్ది రాజిరెడ్డి, ప్రభాకర్, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల దేవేందర్‌తో పాటు పలువురు ఉన్నారు.

◆ **సంక్షేమ పథకాలకు ప్రజాదరణ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజాదరణ పొందుతున్నాయని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీ జనరల్ సెక్రటరీ మార్క సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థ చైర్మన్, బీఎస్పీ సీనియర్ నాయకుడు మంద పాండు, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

◆ **గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక**

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో నిర్వహించిన గౌడ సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్లపల్లి రాజుగౌడ్, ఉపాధ్యక్షుడిగా చిన్న పరశురాములు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌గౌడ్, కోశాధికారిగా శివయ్య, గౌరవ అధ్యక్షులుగా ముత్యం బాల్‌నర్సుగౌడ్, దొడ్ల విష్ణుమూర్తి, స్వామి గౌడ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నాయకులను ఆలయ చైర్మన్ శాలువ కప్పి సన్మానించారు.

◆ **నిధులు మంజూరు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి పనులకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులు మంజూరు చేశారు. రూ.16.50 లక్షలు మంజూరు చేసినట్లు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొలిపాక రాజు తెలిపారు. గురువారం గ్రామాల వారీగా మంజూరైన పనుల వివరాలు వెల్లడించారు.

◆ **ప్రొసీడింగ్ ప్రతుల పంపిణీ**

కోహెడ(హుస్నాబాద్): ఎంపీ బండి సంజయ్ మండలానికి మంజూరు చేసిన రూ.27 లక్షలకు సంబంధించిన ప్రొసీడింగ్ ప్రతులను ఆయా గ్రామాల కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి గురువారం అందజేశారు. సముద్రాల వీరభద్ర ఆలయానికి రూ.5 లక్షలు, రజక సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలు, శనిగరం మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.3లక్షలు, వింజపల్లి పెద్దమ్మ ఆలయం ప్రహరీ నిర్మాణానికి రూ.3లక్షలు, రాంచంద్రాపూర్, బస్వాపూర్, కూరెల్లా, వింజపల్లి, తంగళ్లపల్లి, వరికోలు, కాచాపూర్, కోహెడ, ధర్మసాగర్‌పల్లి, తీగలకుంటపల్లి గ్రామాల్లో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటుకు రూ.13 లక్షలు మంజూరయ్యాయన్నారు.

◆ **మృతదేహం అప్పగింత**

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారి పక్కన లభించిన మృత దేహం కొత్తపల్లి వెంకటేశం (41)గా గుర్తించినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కుకునూరుపల్లి మండలం మేదినీపూర్ శివారులో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం పాఠకులకు తెలిసిందే. పోలీసులు గజ్వేల్ మండలం కొలుగూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా గురువారం గుర్తించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చిన మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

◆ **శుభాకాంక్షల వెల్లువ**

తొగుట(దుబ్బాక): మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా మాధవనేని రఘునందన్‌రావును ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.

◆ **పౌష్టిక ఆహారం తీసుకోవాలి**

కొమురవెల్లి(సిద్దిపేట): కౌమారదశలోని విద్యార్థినులు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ మంజుల అన్నారు. గురువారం కొమురవెల్లి ఉన్నత పాఠశాలలో కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు బాల్య, యుక్త వయస్సులో వచ్చే మార్పులు వివరించారు. ఈ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

◆ **ఘనంగా విద్యార్థుల వీడ్కోలు సమావేశం**

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రభాను, రజని, భారతి, తిరుపతి, మాధవి, యాదగిరి, కిరణ్మయి, ఏసుమణి, రాధాకృష్ణ, ఉమారాణి, మాయావతి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మెల్యే పర్యటన**

దుబ్బాకటౌన్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. దుబ్బాక పట్టణంలో అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు ఆస చిన్నముత్యం కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకొని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మల్లన్నసాగర్ కాలువల నిర్మాణాలు, ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. కాలువల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు.

◆ **ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన**

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో హిందూ స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీఆర్‌ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, మల్లేశం, గుంటుకు రాజు తదితరులు పాల్గొన్నారు.